
www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 26 అక్టోబర్ 2025
5
తిరుపతి



సీఎంను కలిసిన ఆస్టర్ అధినేత



ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ సంస్థ స్థాపకుడు, ఛైర్మన్ డాక్టర్ ఆజాద్ మూపెన్, అలాగే డెప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ అలీషా మూపెన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఆయన యూఏఈ పర్యటన సందర్భంగా అక్టోబర్ 24న దుబాయ్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ సంస్థ పెట్టుబడి ప్రణాళికలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆరోగ్య సేవల అభివద్ధి అవకాశాలుపై సవివరంగా చర్చ జరిగింది. రాష్ట్ర ప్రజలకు అధునాతన వైద్య సదుపాయాలను అందించేందుకు, అలాగే ప్రైవేట్ రంగం భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు అనుకూల మార్గాలను ఈ సమావేశంలో పరిశీలించారు. ఆస్టర్ సేవలు అభినందనీయమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు.

అవిలాల వేదాంతపురంలో... ఆగని క'న్నీరు'





● నలుగురి మృతదేహాలు లభ్యం ● 24 గంటలు 'రిస్క్' ఆపరేషన్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

స్వర్ణముఖి నదిలో ఈతకు వెళ్లి గల్లంతైన మృతదేహాలు లభ్యమయ్యాయి. అగ్రహారంలో శుక్రవారం సాయంత్రం నుంచి అన్నపానాదులు ముట్టకుండా తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. శుక్రవారం సాయంత్రం బాలు (16), శనివారం ఉదయం బాలు అన్న తేజ (19), ఉదయం 9.30 గంటలకు ప్రకాష్ (16), సాయంత్రం 6 గంటలకు మునిచంద్ర (17) మృతదేహాలు లభ్యమయ్యాయి. బిడ్డల మృతదేహాలు లభ్యం కావడంతో గుండెలు బాదుకుంటూ రోదించారు. దాదాపు 24 గంటల పాటు పోలీసులు, ఎన్‌డిఆర్ఎఫ్ బృందం చేసిన 'రిస్క్' ఆపరేషన్ సక్సెస్ అయ్యింది. ఎంఎల్ఎ పులివర్తి నాని ఘటనా స్థలంలో తిష్టవేసి సమాచారం తెలుసుకుంటూ కనిపించారు. బాధిత కుటుంబీకులను ఓదార్చారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబాలకు మృతదేహాలను అప్పగించడంతో దహన సంస్కారాలనూ పూర్తి చేశారు. శుక్రవారం సాయంత్రం నుంచి కన్నీటి సంద్రంలో అగ్రహారం గ్రామస్తులు మునిగిపోయారు. బాలు, తేజ ఇద్దరూ ఒకే కుటుంబంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు మునస్వామిరెడ్డి, మంజుల కోలుకోలేని పరిస్థితి.



శుక్రవారం స్వర్ణముఖి నదిలో గల్లంతైన నలుగురు మృతదేహాలు

'స్వర్ణముఖి' మృతుల కుటుంబాలను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం అగ్రహారానికి చెందిన ఏడుగురు యువకులు శుక్రవారం ఈతకెళ్లి వరద ప్రవాహం ఉధతం కావడంతో నలుగురు నీటిలో గల్లంతు అయ్యారని, ముగ్గురి మృతదేహాలు లభ్యయయ్యాయని, మృతుల కుటుంబాలను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. వరద ఉధృతి ఉండే ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. కొంతమంది అక్రమార్కులు స్వర్ణముఖిలో ఇసుక తవ్వేయడం వల్ల 20-30 అడుగుల లోతు గుంతలు చేస్తూ తల్లిదండ్రులకు బిడ్డలు దూరమవడానికి కారణమయ్యారన్నారు. ఇసుక దందాను అరికట్టాలన్నారు. పుట్టినరోజే బాలు మృతిచెందడం ఆ తల్లిదండ్రులను కలచివేసిందన్నారు. ప్రభుత్వం బాధ్యత వహించి కుటుంబాలను ఆదుకోవాలన్నారు.

కూలీలకు వరదసాయం అందించాలి : సిఐటియు

ప్రజాశక్తి - రేణిగుంట

మండలంలో దాదాపు పదివేల మంది భవన నిర్మాణరంగంలో పనిచేసే కార్మికులు ఉన్నారని, వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉపాధి లేకుండా పోయిందని, కూలీలకు వరదసాయం అందించాలని తహశీల్దార్‌కు భవన నిర్మాణ కార్మికుల సంఘం మండల కార్యదర్శి రాజశేఖర్ వినతిపత్రం అందజేశారు. కరకంబాడి, తారకరామానగర్ ప్రాంతాల్లో కూలి పని చేసుకునేవారు ఎక్కువగా ఉన్నారన్నారు. వీరందరికీ నిత్యావసర సరుకులను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెల్వరాజ్, హరినాథ్, దీప, రాధ పాల్గొన్నారు

'మొంథా' ముసురు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పక్షం రోజులుగా ముసురు వర్షం జిల్లాను ముంచేస్తోంది. 'మొంథా' తుపాను ప్రభావంతో రానున్న ఐదు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో తుఫాను సందర్భంగా తీసుకోవలసిన చర్యలపై సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'మొంథా' తుఫానును తేలికగా తీసుకోరాదని, ఈ నెల 27, 28, 29 తేదీలలో ఇది మరింత తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రత్యేకించి మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన కేంద్రాలలో తప్పనిసరిగా ఉంటూ తుఫాను సందర్భంగా ఎప్పటికప్పుడు తలెత్తే పరిస్థితులపై ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు, రెవెన్యు, అగ్నిమాపక శాఖ, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి తదితర అనుబంధ శాఖలు సమన్వయము చేసుకుంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. కాలువల్లో చెత్తచెదారం అడ్డుపడి నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఏపిఎస్‌పిడిసిఎల్ కు సంబంధించి విద్యుత్ స్థంబాలు, తదితర పరికరాలను ముందుగానే సమకూర్చుకొని, విద్యుత్ అంతరాయాలు లేకుండా చూడాలన్నారు. ప్రాజెక్టులనీటి మట్టాలను పరిశీలిస్తూ పంటలు మునగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పిడుగుపాటుకు గురికాకుండా రైతులు పశువులు, గొర్రెలు, మేకలు తదితర జీవాలను మేతకు తీసుకెళ్లరాదన్నారు. మత్స్యకారులు తుపాను సమయంలో వేటకు వెళ్లరాదన్నారు.

ప్రమాద ఘటనలు సకాలంలో తెలియజేసేందుకు సిగ్నల్ అంతరాయం కలగకుండా సెల్ టవర్ల వద్ద జనరేటర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆర్ డబ్ల్యుఎస్ అధికారులు వర్షాభావ ప్రాంతాలలో సురక్షిత నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా డిపిఓ, డిఎల్డిఓ లను ఆదేశించారు. వర్షాల కారణంగా వైద్యాధికారులు వారు వారు పనిచేస్తున్న కేంద్రాలలో తప్పనిసరిగా ఉండాలని, కేంద్రాలలో సరిపడా మందులను ముందుగా సిద్ధం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. పోలీసు రెవెన్యు సిబ్బంది సమన్వయము చేసుకొని నదీ పరివాహక ప్రాంతాల వద్ద ప్రజలు, యువకులు, పిల్లలు వెళ్ళకుండా అప్రమత్తం చేస్తూ గ్రామాలలో టాం..టాం.. వేయించాలన్నారు. ప్రజలకు అవసరమయ్యే నిత్యావసర సరుకులను కూడా ముందస్తుగానే సమకూర్చుకొని ఉంచుకోవాలన్నారు. జిల్లా ఎస్. పి సుబ్బారాయుడు మాట్లాడుతూ 'మొంథా'తుఫానును ఎదుర్కునేందుకు అన్ని సహాయక చర్యలు తీసుకోవడంలో భాగంగా, జిల్లాలోని ఆర్ డిఓ లు, తహసీల్దార్ లు, ఇతర లైన్ డిపార్టుమెంట్లు సమన్వయము చేసుకోవాలన్నారు. అలాగే ముందస్తుగా జేసిబిలు, క్రేన్ లు, రేడియం స్టిక్కర్ జాకెట్స్, రైన్ కోట్స్ లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్‌లో డి ఆర్ ఓ నరసింహులు పాల్గొన్నారు.

పురాతన ఇళ్లల్లో ఉండొద్దు : కమిషనర్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో వర్షాలు కురుస్తున్న తరుణంలో నగరంలోని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వెంటనే సాయం అందించేందుకు అన్ని విభాగాల అధికారులు అందుబాటులో అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్, జాయింట్ కలెక్టర్ ఎస్. మౌర్య నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ పురాతన ఇళ్లల్లో ఉండరాదని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో నగరంలోని అండర్ బ్రిడ్జిలతో పాటు మధురా నగర్ తదితర ప్రాంతాలను నగరపాలక సంస్థ అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. కార్యాలయంలో 24గంటల పాటు టోల్ ఫ్రీ నంబర్లు 0877 - 2256776, 9000822909 లో అందుబాటులో ఉంటారని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బంది లేకుండా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసామని, అక్కడే వసతి, ఆహారం అందిస్తారని తెలిపారు. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వర్షం నీరు నిలిచిపోకుండా ఉండేందుకు యుద్ధ ప్రాతిపదిక చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, డి.ఈ.రమణ, తదితరులు ఉన్నారు.

తిరుపతిలో దంచి కొట్టిన వాన

27-29 తేదీల్లో అతి భారీ వర్షాలు
అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హెచ్చరిక
తిరుపతి కంట్రోల్ : 0877-2236007



శనివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి గరుడవారధి కింద మోకాలి లోతు నీరు

తిరుపతి జిల్లాలో పలు మండలాల్లో గత వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. శనివారం మధ్యాహ్నం సుమారు రెండు గంటలసేపు వర్షం దంచి కొట్టడంతో నగరంలో ఎక్కడ చూసినా ఏ రోడ్డు చూసిన చెరువులను తలపించాయి. తిరుమల బైపాస్ రోడ్డు, తుడా సర్కిల్, లీలామహల్ సర్కిల్ వద్ద వర్షపు నీరు మోకాలు ఎత్తువరకు ప్రవహించడంతో ఇటు రాకపోకలు అటు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అలాగే గరుడ వారధి వద్ద కూడా వర్షం నీరు చేరడంతో వాహనదారుల అవస్థలు పడ్డారు. వర్షం తగ్గిన తర్వాత కూడా సుమారు గంటసేపు వరకు సాధారణ పరిస్థితికి రాలేదు.



గ్రేటర్ తిరుపతి ప్రతిపాదన మా ప్రభుత్వానిదే

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిని మరింత అభివద్ధి చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం తిరుపతి నగరపాలక సంస్థ పరిధిని విస్తరించాలని, గ్రేటర్ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ గా ఏర్పాటు చేయాలన్న సంకల్పంతో నిర్ణయం తీసుకుంటే, దానిని తామే చేసినట్లుగా వైసిపి కార్పొరేటర్లు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడం హేయమైన చర్యని కార్పొరేటర్ నరసింహాచారి అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరపాలక సంస్థ పరిధిని విస్తరించి గ్రేటర్ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ గా చేయడం వలన ప్రజలకు ఎంతో ప్రయోజనకర ఫలితాలు ఉంటాయని, కానీ దానిని కూటమినేతలే వ్యతిరేకిస్తున్నట్లు ప్రచారం చేయడం వైసిపి వారికి తగదన్నారు. గ్రేటర్ ప్రతిపాదన కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టగానే తామంతా ఐక్యంగా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు కుడితి సుబ్రహ్మణ్యం, పొన్నాల చంద్ర, వరిగుంట్ల నారాయణ, నరేంద్ర, అన్నా అనిత యాదవ్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల విభజనకు సహకరించండి : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి నియోజకవర్గ పరిధిలో 1200 కంటే ఎక్కువ ఓట్లు కలిగిన కేంద్రాలను విభజించేందుకు సహకరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించారు. 274 పోలింగ్ కేంద్రాల్లో 14 పోలింగ్ కేంద్రాల లొకేషన్ మార్పు చేయనున్నామని తెలిపారు. నియోజకవర్గ పోలింగ్ కేంద్రాల్లో నాలుగు పోలింగ్ కేంద్రాల పేరు మార్పు చేయనున్నామని తెలిపారు. మొత్తం 274 పోలింగ్ కేంద్రాల్లో 89 పోలింగ్ కేంద్రాల్లో 1200కు మించి ఓటర్లు ఉన్నందున ఆ ఓట్లను విభజించి 84 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో డిలీషన్, కలపడం వంటివి ఏమి లేవని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తహసీల్దార్ సురేష్ బాబు పాల్గొన్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్‌లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి, శ్రీకాళహస్తి

కర్నూలు ఘటన నేపథ్యంలో తిరుపతిలో ప్రైవేట్ ట్రావెల్స్‌లో ఆకస్మిక తనిఖీలను ఎస్‌పి ఎల్.సుబ్బరాయుడు ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసులు, రవాణా శాఖ సంయుక్తంగా ఈ తనిఖీలను శనివారం నిర్వహించాయి. అత్యవసర తలుపులు సరిగ్గా పనిచేస్తున్నాయా, గాజు బ్రేకర్లు, అగ్నిమాపక పరికరాలు, ప్రథమచికిత్స కిట్లు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు. బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, డ్రైవర్ లైసెన్సులు, అనుమతులు సక్రమంగా ఉన్నాయో లేదో నిర్ధారణ చేశారు. ఈ కార్యక్రమంలో శాంతిభద్రతల అదనపు ఎస్‌పి రవి మనోహర్ ఆచారి, డిటిఓ మురళీమోహన్, ట్రాఫిక్ డిఎస్‌పి రామకృష్ణ ఆచారి పాల్గొన్నారు.

కర్నూలు బస్సు ఘటన నేపథ్యంలో స్థానిక ఏపీ సీడ్స్ సర్కిల్ వద్ద శనివారం రాత్రి ఎంవీఐ, పోలీస్ శాఖలు సంయుక్తంగా ప్రైవేట్ ట్రావెల్ బస్సుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. శ్రీకాళహస్తి డిఎస్పి కే. నరసింహమూర్తి, మోటార్ వెహికల్ అధికారి దామోదర్ నాయుడు, శ్రీకాళహస్తి వన్ టౌన్ సీఐ ప్రకాష్ నేతత్వంలో తనిఖీలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న ప్రైవేట్ బస్సు ప్రమాదాలను దష్టిలో ఉంచుకొని ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. వాహన పత్రాలు, లగేజ్ పరిమితి, అత్యవసర ద్వారాలు సరిగ్గా పని చేస్తున్నాయా లేదా అని వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఎస్ఐ కె రవి, కే వెంకటరమణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



తిరుపతిలో తనిఖీలు

క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలకు

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో 2025-2026 విద్యా సంవత్సరంలో చేరిన మొదటి సంవత్సరం విద్యార్థినులకు ఓరియంటేషన్ ప్రోగ్రాంను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డా తిరుమల నారాయణమ్మ అధ్యక్షత వహించారు. వారు మాట్లాడుతూ ఈ కళాశాలలో సీటు పొందడం అదష్టమని విద్యార్థినిలకు అభినందనలు తెలిపారు. ఓరియంటేషన్ ప్రోగ్రాం వల్ల కళాశాలలోని హాస్టల్స్, లైబ్రరీ, ప్రొడక్టివిటీ కౌన్సిల్, ప్లేస్మెంట్ సెల్, స్కిల్ డెవలప్మెంట్ సెల్, రెడ్ క్రాస్, ఎన్ ఎస్ ఎస్, ఎన్ సి సి, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మొదలైన వాటిని గురించి తెలుసుకొని సద్వినియోగ పరచుకోవాలన్నారు. సమాజాభివద్ధికి గురువుల పాత్ర ప్రముఖమైనది కనుక విద్యార్థినులందరూ సామాజిక స్పృహను కలిగి ఉండాలన్నారు. కత్తి కన్నా కలం గొప్పది, కత్తి చేయలేని పనిని కలం చేస్తుందన్నారు, ఆత్మవిశ్వాసాన్ని కలిగి అంకిత భావంతో పనిచేస్తే విజయం చేకూరుతుందన్నారు. ఏకాగ్రతతో చదివి తల్లిదండ్రులకు, గురువులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థినులకు పిలుపునిచ్చారు.ముఖ్య అతిథి విశ్రాంత పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఎన్ కష్ణవేణి శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల వారు విచ్చేసి విద్యార్థినులు కళాశాలలోని అన్ని సదుపాయాలను సక్రమంగా ఉపయోగించుకోవాలన్నారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు.కాలాన్ని వధా చేయరాదన్నారు. మానసిక ఒత్తిళ్లకు లోను కాకుండా సురక్ష, శక్తి యాప్ లను ఉపయోగించుకోవాలన్నారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థినిలు దేశ విదేశాలలో స్థిరపడ్డారన్నారు. లాయర్లుగా, లెక్చరర్లుగా, డాక్టర్లుగా, సినీ రాజకీయ రంగాలలో రాణిస్తున్నారు. ప్రతి ఒక్కరు వాళ్ళ పనిని వాళ్లు చేయడం ధర్మమని తెలియజేశారు, నైతిక విలువలను పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థినులందరికీ ఉజ్వల భవిష్యత్తు ఉండాలని తెలిపారు. ప్రత్యేక అతిథి విద్యాశాఖ సూపరింటెండెంట్ శివకుమార్, స్టూడెంట్ కౌన్సిల్ ఇన్‌ఛార్జి డాక్టర్ బి.జ్యోతి పాల్గొన్నారు.



ఇకపై స్త్రీనిధి రుణాలు రూ.8 లక్షలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

మహిళల ఆర్థిక పరిస్థితిని మరింతగా పెంపొందించాలనే ఉద్దేశంతో సంఘాలకు మునుపు ఇచ్చే స్త్రీనిధి రుణాలను రూ.5 లక్షల నుండి రూ.8 లక్షల రూపాయలకు పెంపుదల చేస్తూ స్త్రీ నిధి 20వ సర్వసభ్య సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్ బాబు తెలిపారు. శనివారం డిఆర్డిఏ కార్యాలయ ఆవరణలో స్త్రీ నిధి 20వ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించమన్నారు. ఈ సర్వసభ్య సమావేశంలో రుణాల పెంపుతో పాటుగా ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, ఎన్టీఆర్ కల్యాణ లక్ష్మి అమలుకు ఆమోదం లభించిందన్నారు. మహిళలు రుణాలు తిరిగి చెల్లించే పద్దతిలో కొత్త యాప్ ను తీసుకురావడం,



ఈ యాప్ ద్వారా మహిళలు తమ సమయాన్ని, ఖర్చును ఆదా చేసుకుని తమ ఇంటి వద్ద నుండే లోన్ తిరిగి చెల్లించే అవకాశం ఏర్పడిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన లాభాలు సభ్య సమాఖ్యలకు పంపిణీ చేయాలని నిర్ణయించామన్నారు. ఇకపై మహిళలకు ఇచ్చే స్త్రీనిధి రుణాలు వినియోగం, పంపిణీపై ఆడిట్, పరిశీలన బందం ద్వారా వెరిఫై చేయడం జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సమావేశంలో మహిళా సంఘాలకు అవసరమైన కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ సర్వసభ్య సమావేశం కు వర్చువల్ గా విజయవాడ నుండి స్త్రీ నిధి ఆంధ్రప్రదేశ్ మేనేజింగ్ డైరెక్టర్ జీవిబిడి ప్రసాద్ పాల్గొని అన్ని మండలాల అధ్యక్షులతో మాట్లాడారని పిడి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్త్రీనిధి ఏజీఎం హేమంత్ కుమార్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పి.ప్రేమలత, స్త్రీనిధి మేనేజర్లు వీరేష్, వనజ, అదిల్ బాషా, మురళీకష్ణ, మల్లేశ్వరయ్య పాల్గొన్నారు.

'పిఎం ఈ సేవ' ఎలక్ట్రిక్ బస్సు పాలసీ

ఆర్టీసీ ఉనికికే ప్రమాదం





ప్రజాశక్తి -తిరుపతి సిటీ

పర్యావరణ హితం పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న ఎలక్ట్రిక్ బస్సు పాలసీ ఆర్టీసీ ఉనికికే ప్రమాదం కానుంది.. ఆర్టీసీ మనుగడ కాపాడుకోవాలంటే ఐక్యంగా ఉద్యమించాలని తిరుపతి వేదికగా రెండు రోజుల పాటు జరిగిన ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర మహాసభలు ఏకగ్రీవంగా తీర్మానించాయి.

కేంద్ర ప్రభుత్వం పీఎం ఈ బస్సు సేవ' పేరుతో ఎలక్ట్రిక్ బస్సుల కోసం ఒక పథకాన్ని ప్రారంభించింది. దీనికోసం కేంద్రం రూ. 20 వేల కోట్లు కేటాయించింది. 10,500 ఎలక్ట్రిక్ బస్సులకు టెండర్లు పిలిచి వివిధ రాష్ట్రాలకు కేటాయించారు. కర్ణాటకకు 4000, హైదరాబాదుకు 2000 అలాగే మిగిలిన రాష్ట్రాలకు ఈ బస్సులను కేటాయిస్తోంది. ఈ బస్సులు కొనుగోలు, నిర్వహణ, నిర్వర్తించేది ప్రైవేట్ ఆపరేటర్. ఎలక్ట్రిక్ బస్సులపై సబ్సిడీ వైబిలిటీ గ్యాప్ నిధులు ప్రైవేట్ ఆపరేటర్లకే ఇవ్వబడతాయి. ఆదాయంతో సంబంధం లేకుండా ఆర్టీసీ ఆపరేటర్కు కిలోమీటర్ల ప్రతిపాదన డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది.

కేంద్ర ప్రభుత్వం పీఎంఈ సేవా పథకం పేరుతో జిసిసి పద్ధతిలో ప్రైవేట్ విద్యుత్ బస్సులను ఆర్టీసీల పేరుతో తిప్పనుంది. ఈపాటికి తిరుపతి జిల్లాలోని అలిపిరి డిపోలో ఉన్న 100 విద్యుత్తు బస్సులు ప్రైవేటు అద్దె బస్సులే. ఏపీఎస్ఆర్టీసీలో మొదటి విడతగా 1050 బస్సులు 12 డిపోలలో, రెండో విడతగా 1250 బస్సులను 19 డిపోలలో తీసుకురానున్నారు. ఈ బస్సులు వస్తే 31 డిపోలు మూతపడడం ఖాయం. 2029 నాటికి ఇప్పుడు ఉన్న బస్సులు అన్నింటిని విద్యుత్ ప్రైవేట్ బస్సులుగా మార్చాలని జీవో నెంబర్ 88 ఇప్పటికే ప్రభుత్వం విడుదల చేసింది. గత నెలలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పనిగంటలు ఎనిమిది నుంచి 13 గంటలకు పెంచాలని, మహిళా ఉద్యోగులు రాత్రిపూట కూడా పనిచేయాలని తీర్మానించారు. ఇప్పటికే రోజుకు పదిగంటలు పనిచేస్తున్న ఆర్టీసీ కార్మికుల పనిగంటలను మరింత పెంచనున్నారు. మహిళలకు ఉచిత బస్ పేరుతో రన్నింగ్ సిబ్బందిపై రెండు గంటలు పనిభారం ఇప్పటికే పెరిగింది. ఆర్టీసీ లో ఉన్న 5000 మంది మహిళలు రాత్రివేళ కూడా పనిచేయాల్సి వస్తుంది. నేడు ఆర్టీసీలో విలువైన స్థలాలను నగరం నడిబొడ్డులో ఉన్న బస్టాండ్లను రాష్ట్ర ప్రభుత్వం అభివద్ధి అనే సాకుతో కార్పొరేటర్లకు, గుత్త పెట్టుబడిదారులకు, లులు లాంటి బహుళ జాతి షాపింగ్ మాల్స్ కు కట్టబెడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటుతున్నా 12వ వేతన కమిటీ వేయలేదు. ఐఆర్ ప్రకటించలేదు, నాలుగు డీఏలు పెండింగ్లో ఉన్నాయి, ఈ అరియర్స్ ఇవ్వలేదు, గత సంవత్సర కాలంగా రిటైర్ అయిన వారికి గ్రాట్యూటీ చెల్లించలేదు. ఐదు సంవత్సరాల లీవ్ ఎన్కాస్మెంట్ పెండింగ్లో పెట్టారు. ఇలా అనేక సమస్యలతో సతమతం అవుతున్న ఏపీఎస్ఆర్టీసీలో విద్యుత్ బస్సుల ప్రవేశం మరింత విచ్ఛిన్నానికి కారణం అవుతుంది. గత 46 సంవత్సరాలుగా సంస్థ రక్షణ కోసం ప్రజా రవాణా విస్తరణ కోసం ఉద్యోగ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం నికరంగా నిరంతరంగా పనిచేస్తున్నది ఏపీఎస్ఆర్టీసీ ఎస్ డబ్ల్యూ ఎఫ్. ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని భావించి నిరంతరం ఆ దిశగా కషి చేస్తోంది. ఈ నేపథ్యంలో ఏపీ పిటిడి (ఆర్టీసీ) స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర 13వ మహాసభలు తిరుపతి జిల్లా కేంద్రంగా, నగరంలోని వేమన విద్యాన కేంద్రంలో ఈ నెల 23, 24వ తేదీల్లో రెండు రోజులపాటు విజయవంతంగా నిర్వహించారు. ఈ మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుంచి, అన్ని జిల్లాలకు చెందిన సుమారు 350 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రస్తుత తరుణంలో ఆర్టీసీ సంస్థను కాపాడుకోవాలనుకుంటే ఐక్య ఉద్యమాలు తప్పదని, ఆ దిశగా అన్ని సంఘాలను కలుపుకొని ముందుకు వెళ్లాలని నిర్ణయించారు, ఈ మహాసభలకు ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు హాజరై తమ మద్దతును తెలియజేయడం గమనార్హం.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పోతుగుంట విజయబాబు

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని రైల్వే క్వార్టర్స్ వద్ద ఉన్న నాగాలమ్మ దేవాలయంలో శనివారం నాగులచవితి పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాతలు శ్రీకాంత్, జయశ్రీ సాయంతో అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయబాబు అన్నదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదానానికి మించిన దానం ఏదీ లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధనపాల్, ఎల్బూరు సూరి, కిషోర్, మనోహర్, విజయకుమార్, పాల్గొన్నారు.

రహదారుల పరిశీలన

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): వర్షాల కారణంగా మండలంలోని కొన్ని పంచాయతీల్లో రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎంపీడీవో సురేంద్రనాథ్ కాసరం పంచాయతీ గొట్టి పూడి గ్రామానికి వెళ్లి



వర్షానికి దెబ్బతిన్న రోడ్లను పరిశీలిస్తున్న ఎంపిడిఓ

రహదారులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు చాలా గ్రామాల్లో రోడ్లు దెబ్బతిన్నాయని, గ్రామాల్లో ఎక్కడా చెత్తా చెదారం, మురుగునీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యంపై దృష్టి సారించి గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలు అనారోగ్యానికి గురి కాకుండా అధికారులు బాధ్యత వహించాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాసరం పంచాయతీ కార్యదర్శి హంస ప్రకాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆవాస్ ప్లస్ సర్వే యాప్ పరిశీలన

ప్రజాశక్తి - వాకాడు: ప్రధాన మంత్రి ఆవాస యోజన గ్రామీణ పథకం కింద పక్కా గృహాలు మంజూరు చేసుకోవడానికి కేంద్రం ప్రభుత్వం ఆవాస్ ప్లస్ సర్వే యాప్‌ను ప్రవేశపెట్టిందని, ఆ యాప్‌లో 404 ఎర్రర్ వస్తున్న సందర్భంగా ఆ యాప్‌ను పీడీ వేంకటేశ్వరరావు శనివారం వాకాడు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మండలంలో మొత్తం 1809 గృహాలకు దరఖాస్తులు వచ్చాయని వాటి పూర్తి సమగ్ర సర్వే కోసం సచివాలయ సిబ్బంది సర్వే నిర్వహిస్తారని, అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో పొజిషన్ పత్రాలు ఇవ్వబడుతుందని వారు సూచించారు. ఈ సర్వే నవంబర్ 5వ తేదీ వరకు మాత్రమే ఉంటుందని దరఖాస్తు దారులు అప్రమత్తంగా ఉండి వారిని నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఇంజనీర్ యండీ షఫ్రీర్, ఎంపీడీఓ సాయి ప్రసాద్, ఏఈ భాస్కర్ రావు, రమేష్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



ప్రజా ఉద్యమం పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి- వాకాడు: వైసీపీ ప్రజా ఉద్యమం పోస్టర్‌ను ఆ పార్టీ నాయకులు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త, ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. ఈ నెల 28వ తేదీ మంగళవారం గూడూరులో నిర్వహించనున్న ర్యాలీలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన ప్రజా ఉద్యమం కార్యక్రమానికి యువత, పార్టీ కార్యకర్తలు తరలి వచ్చి జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఇ సి సభ్యులు కొడవలూరు దామోదర్ రెడ్డి, వాకాడు మండల కన్వీనర్ ఏనుగు సుధాకర్ నాయుడు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్తీకి కేరాఫ్ జగన్: ఎమ్మెల్యే



సురక్షా యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కల్తీకి కేరాఫ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ అని రాష్ట్ర ప్రజలే సూచిస్తారని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్ పై ఎమ్మెల్యే శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కల్తీ మద్యంపై చేస్తున్న చిల్లర రాజకీయాలను తీవ్రంగా ఖండించారు. కల్తీ మద్యం, కల్తీ నెయ్యికి పాల్పడింది గత జగన్ ప్రభుత్వం అని విమర్శించారు. కూటమి పాలనలో కల్తీమద్యం బయటపడితే ముఖ్యమంత్రి చంద్రబాబు పారదర్శకంగా విచారణ చేపట్టి సొంత పార్టీ నాయకులపైన సైతం చర్యలు చేపట్టారని కొనియాడారు. అత్యాధునిక సాంకేతికతతో మద్యం నాణ్యతను వినియోగదారులే తెలుసుకునేలా 'ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్'ను తీసుకొచ్చింది తమ ప్రభుత్వమేనన్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు, పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

కోతకు గురైన రోడ్డు పరిశీలన

ప్రజాశక్తి -చంద్రగిరి: చంద్రగిరి మండలం నడింపల్లి రోడ్డు భారీ వర్షాల కారణంగా ప్రమాద స్థాయికి చేరుకుంది. నడింపల్లి రోడ్డును అధికారులు, కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే పులివర్తి నాని పరిశీలించారు. గతంలోనూ కురిసిన భారీ వర్షాలకు బ్రిడ్జి కొట్టుకుపోయిందని గ్రామస్తులు ఎమ్మెల్యేకు తెలిపారు. గతంలో నడింపల్లి బ్రిడ్జి పనులు చేపట్టాలని పలు దఫాలు అర్జీలు ఇచ్చినా పట్టించుకోలేదని తెలిపారు. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డు కోతకు గురైంది. రోడ్డు కోతకు గురికాకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి -చంద్రగిరి: చంద్రగిరి లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, తిరుపతి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఏ రెడ్డి బాలాజీ, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ పర్యవేక్షణలో పాలిటెక్నిక్ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి భక్తవత్సలం ప్రారంభించి, కంటి ఆరోగ్య ప్రాముఖ్యతపై విద్యార్థులకు విలువైన సందేశం అందించారు. 'కంటిలో వెలుగు జీవనంలో వెలుగు, దృష్టిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత'అని విద్యార్థులకు సూచించారు. ఈ శిబిరంలో సుమారు 150 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా, 40 మంది విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారులకు, కళాశాల సిబ్బందికి, విద్యార్థులకు ప్రిన్సిపాల్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ పి. నాగేంద్ర, ఎం. నరసింహులు, స్టూడెంట్ అడ్వైజర్ కె. కృష్ణవేణి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్వియూలో వర్షం పడితే చిత్తడే

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పరిపాలన భవనం నుంచి ఇంజనీరింగ్ కళాశాల, మేనేజ్‌మెంట్ కళాశాల, ఐఎస్ఈ బిల్డింగ్, సైన్స్ కళాశాల, వామన రావు భవనం, ముఖ్యంగా ప్రకాశం భవనం వంటి కళాశాలలో ఏ చిన్నపాటి వర్షం వచ్చినా పై కప్పు ద్వారా నీరు కారుతుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గతంలో వర్సిటీ ఉన్నతాధికారులు సోలార్ ప్యానల్‌లను ప్రతి కళాశాల భవనం పైన ఏర్పాటు చేయడం ద్వారా డ్రిల్లింగ్ చేయడంతో అక్కడ రంధ్రాలు ఏర్పడి వర్షం నీరు మిద్దెపై నిలిచి చిన్నపాటి వర్షానికి బిల్డింగ్ మొత్తం తడిసి ముద్ద అయిపోతోంది. దీంతో ఆయా కళాశాలలో చదివే వికలాంగ విద్యార్థులు, సిబ్బంది జారి పడి ప్రమాదానికి గురవుతున్నారు. గతంలో సిబ్బంది బోధనేతర సిబ్బంది కూడా వికలాంగుల్లో కొంతమంది ఈ బిల్డింగుల్లో నడిచిపోతుండడం ద్వారా జారిపడి చాలా ప్రమాదాలకు గురయ్యారు. మూడు రోజులుగా ప్రకాశం భవనంలో వర్షపు నీటికి కరెంటు వైర్లు అన్ని కాలిపోయి బూడిదైపోయాయి. విద్యుత్ సిబ్బంది సకాలంలో గుర్తించి వైర్లని బాగు చేయడం ద్వారా మూడు రోజుల తర్వాత ప్రకాశం భవనంలో విద్యుత్ వచ్చింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ సమస్యను గుర్తించి ఏ



వర్షానికి ఉరుస్తున్న ఎస్వియూ క్యాంపస్

చిన్నపాటి వర్షానికి భవనాలు నీరు ఉరవకుండా ఉండేందుకు ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు, బోధన, బోధనేతర సిబ్బంది కోరుతున్నారు.

చీఫ్ జస్టిస్ గవాయిపై దాడి హేయం

1న 'చలో హైదరాబాద్' 15న 'చలో ఢిల్లీ'



సమావేశమైన ఎంఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ నవంబరు 1వ తేదీ చలో హైదరాబాద్‌ను, నవంబరు 15వ తేదీ చలో ఢిల్లీని నిర్వహిస్తామని ఎంఆర్‌పిఎస్ వెంకటగిరి నియోజవర్గ ఇన్‌ఛార్జి పల్లిపాటి రవి పేర్కొన్నారు. వెంకటగిరి టౌన్ 25వ వార్డు కంపాలెం అరుంధతి వాడలో ఎంఆర్‌పిఎస్ నాయకుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ వెంకటగిరి నియోజకవర్గం నుండి ప్రతి గ్రామం నుండి ఇంటి కొక్కరు తరలిరావాలని సూచించారు. నవంబరు 15వ తేదీన చలో ఢిల్లీని విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ వెంకటగిరి టౌన్ అధ్యక్షుడు కంటి పల్లి మనీ, పెంచలయ్య, లంక రవి, శ్రీను, లంక శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : బాల్యవివాహాలు నేరమని, ఎక్కడైనా చోటుచేసుకుంటుంటే అధికారుల దృష్టికి తీసుకు రావాలని న్యాయమూర్తి సులోచన రాణి సూచించారు. గూడూరు పట్టణంలోని కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో బాల్య



అవగాహన కల్పిస్తున్న న్యాయ సేవ సిబ్బంది

వివాహాల వల్ల జరిగే నష్టాల గురించి ప్రజలకు అవగాహన సమావేశం నిర్వహించారు. గూడూరులోని కోర్టు ఆవరణలో బాల్యవివాహాల వల్ల జరిగే నష్టాల గురించి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి సులోచన రాణి మాట్లాడుతూ ఇంకా కొన్ని ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నాయని, దీని వల్ల చిన్నతనంలోనే గర్భం దాల్చి కాన్పు సమయంలో చనిపోతున్నారన్నారు. చట్టం ప్రకారం బాల్యవివాహాలు నేరమని, దీనికి సహకరించిన వారికి కూడా శిక్ష పడు తుందన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు దృష్టికి వస్తే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏడవ అదనపు జిల్లా న్యాయమూర్తి వెంకట నాగ పవన్ , న్యాయవాదులు రజనీకాంత్ రెడ్డి, రమేష్ నాయుడు , భాగ్యలక్ష్మి పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కల్తీ మద్యం నివారణకే 'సురక్ష యాప్': ఎమ్మెల్యే



సురక్షయాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కల్తీ మద్యం నివారణకు రాష్ట్ర ప్రభుత్వం సురక్ష యాప్‌ను తీసుకొచ్చిందని, మద్యం దుకాణా ల వద్ద కొనుగోలుదారులు మద్యాన్ని కొనుగోలు చేసి నప్పుడు యాప్ ద్వారా మద్యం నాణ్యమైనదా? కల్తీయేనా? అని తెలుసుకోవచ్చుని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని బాలాజీ నగర్‌లోని మద్యం దుకాణం వద్ద ఆయనతో పాటు అధికారులు యాప్‌పై అవగాహన కలిగించారు. బాలాజీ నగర్ సమీపంలో మద్యం దుకాణం వద్ద ఎమ్మెల్యే, ఎక్సైజ్ అధికారులు ఈ యాప్ ద్వారా మద్యాన్ని తనిఖీ చేసి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్ కుమార్, భాస్కర్ రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, సోమిశెట్టి చెంచురామయ్య, శివకుమార్, పెంచలయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

మోసగించేందుకే సంతకాల నాటకం: టిడిపి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రజలను మోసగించడానికే జగన్ సంతకాల సేకరణ నాటకాన్ని తెరపైకి తెచ్చాడని టీడీపీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టరు ఎం ఉమేష్ రావు విమర్శించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాత విధానంలో కట్టిన ఐదు



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

మెడికల్ కళాశాలలో 213 ఫ్రీ సీట్లు వస్తే, పీపీపీ మోడల్ లో కట్టే మెడికల్ కాలేజీలలో 850 ఫ్రీ సీట్లు పెరుగుతాయని దానర్థం ఎక్కువ మంది పేద విద్యార్థులు తమ డాక్టర్ కలను నెరవేర్చుకుంటారన్నారు. పేదలకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన వైద్యం అందుబాటులోకి వస్తుందని అది నచ్చకే జగన్ ప్రయివేట్ పరం అంటూ సంతకాల నాటకం ఆడుతున్నారని మండిపడ్డారు. ఈ సమావేశంలో నాయకులు మిన్నల్ రవి, బీమాల భాస్కర్, వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్, మణి, సులేమాన్, గంగనపల్లి రమేష్ పాల్గొన్నారు.


చంద్రబాబు ప్రభుత్వం దగా: మాజీ ఎమ్మెల్యే



కోటి సంతకాలను సేకరిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-నాయుడుపేట: రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తూ కూటమి ప్రభుత్వం వైద్య విద్యార్థులను మోసం చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యార్థుల జీవితాలు నాశనం అయ్యేలా పాలన సాగిస్తున్నారని సూళ్లూరుపేట నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణలో భాగంగా శనివారం నాయుడుపేట మండలం కాపులూరు గ్రామంలో వైసీపీ నాయకులతో కలిసి రచ్చబండ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటుకరణకు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణపై ప్రజలకు వివరించి, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకోవాలని కోరుతూ సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట వైసీపీ పట్టణ అధ్యక్షులు కలికి.మాధవ రెడ్డి, నాయుడుపేట మండల వైసీపీ అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్, నాయుడుపేట ఎంపీపీ కురుగొండ. ధనలక్ష్మి, విజయ డెయిరీ డైరెక్టర్ కట్టా భవానీశంకర్ రెడ్డి, నాయుడుపేట మాజీ ఏఎంసీ చైర్మన్ ఒట్టూరు రాధా కిషోర్ యాదవ్ స్థానిక ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మృతి



ప్రజాశక్తి - కార్వేటినగరం: కార్వేటినగరానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు టివి రాఘవులునాయుడు (85) వృద్ధాప్య సమస్యలతో మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు వున్నారు. కొడుకులు ఇద్దరు సాయిరాం, హరికృష్ణ అమెరికాలో సాఫ్ట్‌వేర్లుగా సెటిలయ్యారు. కూతుళ్ల సంధ్యారాణి, కిరణ్ ఉన్నారు. 1940లో జన్మించిన రాఘవులునాయుడు స్వగ్రామం కార్వేటినగరం. రాజావారు నిర్మించిన పాఠశాలలో చదువుకుని, ప్రభుత్వ పాఠశాలలోనే అసిస్టెంట్ సైన్స్ టీచర్‌గా పనిచేశారు. కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం రాళ్లబూదుగూరులో పనిచేశారు. అనంతరం కెవిపురంలోనూ పనిచేసి 20ఏళ్ల క్రితం రిటైర్ అయ్యారు. ఆయన దగ్గర పాఠాలు నేర్చుకున్న విద్యార్థులు డాక్టర్లుగానూ, సైంటిస్ట్‌లుగానూ దేశ విదేశాల్లో సెటిలయ్యారు. ప్రపంచంలోనే న్యూరో సర్జన్‌గా ద్వితీయ స్థానంలో పేరుగాంచిన డాక్టర్ వెంకటరమణ కూడా ఆయన శిష్యులే. ఆయన మృతికి గ్రామస్తులు, విద్యార్థులు నివాళి అర్పించారు. ఆయన అంత్యక్రియలు సొంతూరులోనే ఆదివారం ఉదయం నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

హెల్మెట్లు ధరించకుంటే జరిమానా: ఎస్ఐ



ప్రజాశక్తి- కెవిబి పురం: ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని కెవిబిపురం ఎస్ఐ నరేష్ పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపే వారికి జరిమానా విధిస్తామన్నారు. హెల్మెట్ వాడడం వల్ల ఈ వర్షాకాలం అనుకోకుండా ప్రమాదాలు చోటు చేసుకుంటే ప్రాణాలు రక్షించుకునే అవకాశం ఉందన్నారు. త్రిబుల్ డ్రైవింగ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడపడం నిషేధమన్నారు. ఇందులో భాగంగానే కేవిబిపురం మండలంలో వివిధ ప్రాంతాల్లో వాహనాలు తనిఖీలు నిర్వహిస్తూ దీనిపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ఆధార్ క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలి: ఎంపీడీఓ

ప్రజాశక్తి-బుచ్చి నాయుడు కండ్రిగ: ఈ నెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్న ప్రత్యేక ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడివో వెంకటరత్నమ్మ పేర్కొన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రత్యేక ఆధార్ క్యాంపుల్లో భాగంగా విద్యార్థుల సౌకర్యార్థం బిఎన్ కండ్రిగ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, నెలవాయి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో, బిఎన్ కండ్రిగ సచివాలయంలో ప్రత్యేక ఆధార్ క్యాంపు సోమవారం నిర్వహిస్తామని తెలిపారు. ఆయా పాఠశాలల విద్యార్థులు, ఆధార్ కార్డు లేని వారు కొత్తగా నమోదు చేసుకోవచ్చున్నారు. దీంతోపాటు ఆధారు చిరునామా, పేరు మార్పు, తప్పొప్పులను సరిచేసుకునే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు ఎటువంటి రుసుము చెల్లించకుండా ఉచితంగా చేసుకోవచ్చనన్నారు.

మామిడి రైతుల ఖాతాలకు సబ్సిడీ జమ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఈ ఏడాది ప్రభుత్వం మామిడి రైతులకు ప్రకటించిన కేజీకి నాలుగు రూపాయల సబ్సిడీ రైతుల ఖాతాలకు జమ చేశామని ఉద్యానవన శాఖ అధికారిణి వెంకట సౌజన్య. పేర్కొన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రైతుకి ఆధార్ లింక్ ఉన్న బ్యాంకు ఖాతాలకు సబ్సిడీ మొత్తం జమచేశామని తెలిపారు. మామిడి కాయలు తోలిన ప్రతి రైతుకి వారి ఖాతాలకు సబ్సిడీ విడతల వారీగా జమ అవుతుందన్నారు. మామిడి రైతులు ఎవరైనా అర్జీలు ఇవ్వాలనుకున్న వారు ఈ నెల 30వ తేదీ లోపు ఉద్యాన అధికారి, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ వ్యవసాయ మార్కెట్ యార్డు పుత్తూరు కార్యాలయంలో ఇవ్వాలని పేర్కొన్నారు.

టమాటా లారీ బోల్తా

ప్రజాశక్తి- చంద్రగిరి: టమాటా లారీ ప్రమాద వశాత్తు అదుపు తప్పి బోల్తా పడిన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. చంద్రగిరి పరిధిలో తిరుపతి మదనపల్లి జాతీయ రహదారిలో భాకరాపేట ఘాట్ లో టమాటో లోడ్డుతో వస్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. లారీ పడడంతో డ్రైవర్, క్లీనర్ లకు చిన్న గాయాలతో బయట పడ్డారు. పీలేరు నుంచి తిరుపతి కి టమాటో లోడ్ తో తిరుపతికి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. చంద్రగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యానాదుల సంక్షేమ సంఘం పర్యటన



పర్యటిస్తున్న యానాదుల సంక్షేమ సంఘం నాయకులు

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం పట్టాభి గిరిజన కాలనీలో యానాది సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా కమిటీ శనివారం పర్యటించింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గిరిజన కాలనీలోని 3 ఇళ్లు దెబ్బతిన్న కారణంగా ఆ ఇంట్లో నివసిస్తున్న గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తిరుపతి జిల్లా అధ్యక్షుడు, తలపల చెంచు మల్లికార్జున రావు దృష్టికి తీసుకొచ్చారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి ఇళ్లు కోల్పోయి గిరిజనులు కొట్లపాటి మంజుల, ఊదురు సుహాసిని , తుమ్మూరు శ్రీనివాసులు ఇబ్బందిపడుతున్న విషయాన్ని ఈ విషయమై తిరుపతి జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాజుకి వివరించారు. స్పందించిన ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఇల్లు కోల్పోయిన గిరిజనులను పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యానాదుల సంక్షేమ సంఘం జిల్లా ఛైర్మన్ అత్తూరు చెంగల్రాయులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు, శ్రీమంతుల రామయ్య, జిల్లా అధ్యక్షురాలు ఎలుగోటి రేవతి, ప్రధాన కార్యదర్శి తిరుపతి రాములమ్మ, ఉపాధ్యక్షులు పనబాకుల కల్పన, తుమ్మూరు శ్రీనివాసులు, పట్టాభి కాలనీ గిరిజనులు పాల్గొన్నారు

కర్నూలు బస్సు దుర్ఘటన బాధాకరం

- మయూరి శ్యామ్ యాదవ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కర్నూలు బస్సు దుర్ఘటన బాధాకరమని శ్రీకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బండి శ్యామ సుందరరావు (మయూరి శ్యామ్ యాదవ్) పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో 19మంది బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరం విచారం వ్యక్తంచేశారు. బాధిత కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని కోరారు. గాయపడిన వారు త్వరంగా కోలుకోవాలని సూచించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు:ఎస్ఐ

ప్రజాశక్తి-నాయుడుపేట: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారి వల్లే ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఓజిలి ఎస్ఐ కె శ్రీకాంత్ హెచ్చరించారు. ఓజిలి మండల పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఐదుగురిని కోర్టులో హాజరు పరచగా వారికి న్యాయమూర్తి ఒక్కొక్కరికి పదివేల రూపాయలు జరిమానా విధించారని ఓజిలి ఎస్సై కే శ్రీకాంత్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ విలేకరులతో మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే మొదటిసారి పదివేల రూపాయలు, మళ్లీ మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే జైలు శిక్ష విధిస్తారని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. డ్రైవింగ్‌కు సంబంధించి అన్ని ధ్రువీకరణ పత్రాలు వుంచుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, ఫోర్ వీల్ వాహనదారులు సీటు బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలని ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆలయాల సందర్శనకు ఆర్‌టిసి ప్యాకేజీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 27వ తేదీన శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో ఆలయాల సందర్శనకు ఒక్కరోజు ప్రత్యేక ప్యాకేజీని అందుబాటులోకి తెచ్చిందని డిపో మేనేజర్ రేవతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుడిమల్లం, అప్పలాయగుంట, వకుల మాత టెంపుల్, ముక్కోటి, తలకోన ఆలయాల సందర్శనకు రాను పోను ఛార్జీలు రూ. 450కే ఎక్స్‌ప్రెస్ బస్సును అందుబాటులో ఉంచుతున్నట్లు వివరించారు. సోమవారం ఉదయం ఐదు గంటలకు శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రానైట్ క్వారీల కార్మికులకు భద్రత కల్పించాలి



తహశీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న దళిత, గిరిజన సంఘం నాయకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక మున్సిపాల్టీ పరిధిలోని ఈశ్వపురం గుజనేత్తం, ఒంటిమిట్ట, రాజుపాలెం గ్రామాల్లో గ్రానైట్ క్వారీ పేలుడుకు ఇండ్లు మరమ్మతుకు గురి అవుతున్నాయని దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై నందయ్య ఆధ్వర్యంలో పుత్తూరు తహశీల్దారు జిసి వేంకటేశ్వర్లును కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై నందయ్య మాట్లాడుతూ ఈశ్వర పురం లెక్కదాకల సర్వే 06 లో గ్రానైట్ క్వారీలు వున్నాయన్నారు. గతంలో శక్తి వంతమైన పేలుళ్ల వల్ల ఈశ్వర పురం, బొజ్జనత్తం, ఒంటిమిట్ట, రాచ పాళ్యం గ్రామాలల్లో టీవీలు పగిలిపోయి, ఇంటి గోడలు పగుళ్లు ఏర్పడ్డాయన్నారు. మూగ జీవులు ఆవులు, మేకలు మేతకు వెళ్లడానికి భయపడుతున్నాయన్నారు. ముఖ్యంగా శభరి గ్రానైట్ క్వారీలో గతంలో పేలుళ్ల వల్ల బొజ్జనత్తం గిరిజన బాలుడికి తీవ్ర గాయాలతో స్విమ్స్‌లో చికిత్స పొందాడన్నారు. ఈ నెల 21వ తేదీ శభరి గ్రానైట్ క్వారీలో పనిచేస్తున్న ఒరిస్సాకి చెందిన నారి నాయక్ అంతర్గత కుమ్ములాటలో మృతి చెందాడన్నారు. అతనికి క్వారీ యజమానులు ప్రమాద బీమా కలిపించి, ప్రభుత్వం నుండి ఆర్థిక సాయం అందించాలని కోరారు. గ్రానైట్‌లో పనిచేస్తున్న కార్మికులకు, కార్మికుల ఈఎస్ఐ, ఈపీఫ్ఒ, ఈ శ్రమ కార్డులు, హెల్త్ ఇన్స్యూరెన్స్, ఈ స్కీములు కార్మికులకు అమలు చేయకుండా పని చేయించు కుంటున్నారన్నారు. కలెక్టరు వెంటనే స్పందించి శభరి గ్రానైట్ క్వారీని తనిఖీ చేసి కార్మికులకు, ప్రజలకు, మూగ జీవులకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన పుత్తూరు తహశీల్దారు ఉన్నతాదిధులచే పరిశీలించి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు కౌన్సిలర్ బాలసుబ్రహ్మణ్యం, దళిత నాయకులు పి గురవయ్య, జి సుధాకర్, ఎ పలని పాల్గొన్నారు.

క్రైం న్యూస్

పది ఎర్రచందనం దుంగలు స్వాధీనం



ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుంటున్న ఫారెస్టు అధికారులు

ప్రజాశక్తి -బాలాయపల్లి : మండలంలోని అలిమిలి ఫారెస్ట్‌లో అటవీ శాఖ డివిజన్ రేంజర్ అధికారి జి సంపత్ ని ఆధ్వర్యంలో శనివారం తనిఖీలు నిర్వ హిస్తుండగా పది ఎర్ర చందనం దుంగలను అటవీ శాఖ అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. డిఆర్ఓ సుహాసిని కథనం మేరకు తన సిబ్బందితో కలిసి ఫారెస్ట్‌లో తనిఖీ నిర్వహిస్తుం డగా వాహనాల జాడలు కనిపించాయన్నారు. దీంతో ఫారెస్టును జల్లెడ పట్టి తనిఖీలు చేయగా చెట్ల పొదల్లో పది దుంగలు ఉంచడాన్ని గుర్తించామన్నారు. గుర్తించిన దుంగలను వెంకటగిరి అటవీ రేంజ్ కార్యాలయానికి తరలించామన్నారు. ఆమె వెంట భవాని, అశోక్, గిరి పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై విచారణ

ప్రజాశకి-బాలాయపల్లి: మండలంలోని నిడిగల్లు గ్రామానికి చెందిన సర్వేపల్లి వజ్రమ్మ కు అదే గ్రామానికి చెందిన వేలంపాటి లక్ష్మీనారాయణ రెడ్డి, శ్రీనివాసరెడ్డి ల మధ్య భూ వివాదం నెలకొని వజ్రమ్మను కులం పేరుతో దూషించి చంపేస్తామని బెదిరించారని బాలాయపల్లి పోలీసులకు మూడు రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బాలాయపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. గూడూరు డిఎస్పి గీతా కుమారి శనివారం విచారణ చేపట్టారు. ఆమె వెంట బాలాయపల్లి ఎస్ఐ గోపి పాల్గొన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి -నాగలాపురం: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. స్థానిక బిసి కాలనీలో నివసిస్తున్న మునిలక్ష్మి (55) వివాహమైన మూడేళ్లకే భర్తను కోల్పోవడంతో అప్పటి నుండి ఒంటరిగా జీవనం సాగిస్తోంది. స్థానికంగా ఓ హోటల్లో రోజువారీగా పనిచేసుకుంటూ పూట గడుపుకుంటోంది. శుక్రవారం యధావిధిగా పనికోసం హోటల్‌కు వెళ్ళి తిరిగి రాత్రి ఇంటికి చేరుకుంది. శనివారం ఉదయం పని కోసం హోటల్‌కు రాక పోవడంతో యజమాని పక్కింటి వాళ్లకు ఫోన్ చేయడంతో ఆమె కోసం వెళ్లగా ఇంట్లో మునిలక్ష్మి విగత జీవిగా పడివుంది. గొంతు వద్ద గాయం ఉండటం గమనించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు స్థానికులు నిర్ధారించి, పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందించడంతో ఎస్ఐ సునీల్, డీఎస్పీ రవికుమార్, పుత్తూరు సీఐ రవీంద్ర తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోలీసులు ఇంటి పరిసర ప్రాంతం లో ఉన్న వారిని విచారించగా గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి ఆమె ఇంటి వద్దకు వచ్చినట్లు స్థానికులు పోలీసులకు తెలిపారు. ఇంటికి వచ్చిన హంతకులు నగల కోసం హత్య చేసి వుంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా దర్బార్‌లో ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి -చంద్రగిరి: చంద్రగిరి నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే పులివర్తి నాని శనివారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఆరు మండలాల నుంచి వచ్చిన ప్రజలు నుండి అర్జీలు స్వీకరించి ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరిస్తూ ఆయా మండలాలకు సంబంధించిన అధికారులకు అందిస్తామని తెలిపారు.ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ప్రతి సోమవారం కలెక్టర్, తహశీల్దార్ కార్యాలయలలో ప్రజా వేదిక నిర్వహిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన వారి సమస్యను ఎమ్మెల్యే విన్నారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు . ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల కూటమి పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

మట్టి కల్వర్టుకు మరమ్మతు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మండల వ్యాప్తంగా రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురిశాయి. ఈ నేపథ్యంలో తడుకు పంచాయతీ వి ఎస్ ఎస్ పురం నుంచి సదాశివ కోనకు వెళ్లే



మట్టి కల్వర్టుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

మార్గంలో ఉన్న మట్టి కల్వర్ట్ కుంగింది. కోనకు వెళ్లే భక్తుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఎమ్మెల్యే. గాలి భాను ప్రకాష్. దృష్టికి వెళ్లడంతో వెంటనే సంబంధిత శాఖ అధికారులకు చెప్పడంతో అధికారులు తక్షణమే స్పందించారు. అధికారి చంద్రశేఖర్ రోడ్డుకు కల్వర్టు ఏర్పాటు చేసి రోడ్డు మరమ్మతులు స్థానిక సర్పంచ్ వెంకటేష్ బొబ్బిలి యాదవ్. అధ్యక్షతన మరమ్మతులు చేయించారు. మరమ్మతు చేసినందుకు వీ ఎస్ ఎస్ పురం గ్రామస్తులు ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో యూనివర్సిటీ హెల్త్ సెంటర్‌లో రక్తదాన శిబిరాన్ని రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతిలోని స్విమ్స్‌కు దాదాపు 75 మంది విద్యార్థులు రక్త దానం చేశారు. పద్మావతి నగర్ లోని శ్రీ సత్యసాయి సేవా సమితి సహకారంతో ఈ శిబిరం నిర్వహించారు. ఇంజనీరింగ్ ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ శ్రీనివాసులు రెడ్డి , ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ అరుణజ్యోతి ఎస్వి యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ ఆచార్య జి. శ్రీనివాసులు, యూనివర్సిటీ జాతీయ సేవా పథకం సమన్వయకర్త ఆచార్య దామోదరం నాయకత్వంలో ఈ కార్యక్రమం విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఎస్వి యూనివర్సిటీ హెల్త్ సెంటర్ వైద్యులు, వైద్య సిబ్బంది తమ సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి సదుపాయాలను అందించారు.

ఎస్‌వియూలో ఆధార్ సెంటర్ పొడిగింపు



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ప్రకాశం భవనంలోని ఉపాధ్యక్షులు (వైస్ ప్రిన్సిపల్) చాంబర్‌లో మూడు రోజులుగా ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బందికి, వారి పిల్లలకు, విద్యార్థులకు, పరిశోధకులకు, ఇంజనీరింగ్, సైన్స్, ఆర్ట్స్, మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థినులు, పరిశోధకులకు ఆధార్ కార్డులో అడ్రస్సులో మార్పు, చేర్పులు, ఫొటో అప్‌మేట్ చేయడం వంటి వివరాలన్నీ తపాలా శాఖ వారి సిబ్బంది సహకారంతో ఏర్పాటు చేశారు. ప్రకాశం భవనంలోని వైస్ ప్రిన్సిపల్ ఆచార్య భాస్కర్ రెడ్డి చాంబర్లో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో గత మూడు రోజులుగా వర్సిటీ విద్యార్థులు, పరిశోధకులు, బోధన, బోధనేతర సిబ్బంది ఆధార్ కేంద్రాన్ని, వారు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. 3 రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల కొంతమంది సిబ్బంది వారి పిల్లల్ని సకాలంలో ఆధార్ కేంద్రానికి తీసుకురాలేక పోయామని, మరి కొన్ని రోజులు గడువు కావాలని ఉన్నతాధికారులకు విన్నవించారు. ఎక్కువమంది వర్సిటీలోని బోధన, బోధనేతర సిబ్బంది పిల్లలు స్కూలుకు, కాలేజీలకు వెళుతుండడంతో ఆధార్ కార్డులో కొన్ని మార్పులు చేర్పులు అత్యవసరం అని వారు వెల్లడించారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆపార్ ఐడి కార్డు రావాలంటే ఆధార్ కార్డులో ఎలాంటి తప్పులు లేకుండా టెన్త్ క్లాస్ మార్క్స్ లిస్ట్ ప్రకారం పూర్తి పేరు అక్షరాలు వచ్చేలా ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలని ఆధార్ కేంద్రం నిర్వాహకులు సూచించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుధారాణిని ప్రశ్నించడగా పోస్టల్ శాఖ అధికారులతో మాట్లాడి ఆధార్ నమోదు మోడిఫికేషన్ కేంద్రాన్ని సోమవారం మధ్యాహ్నం నుంచి మంగళవారం, బుధవారం రెండు రోజుల పాటు నిర్వహిస్తామని, ఎవరైనా ఇంకా ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాల్సిన వాళ్ళు ఎవరైనా ఉంటే వర్సిటీ సిబ్బంది ఈ రెండు రోజుల్లో ప్రకాశం భవనంలోని వైస్ ప్రిన్సిపాల్ ఛాంబర్ కి చేరుకొని పూర్తి చేసుకోవాలని సూచించారు.

పిఎం సూర్యఘర్ అమలులో తిరుపతి ప్రథమ స్థానం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: పిఎం సూర్యఘర్ పథకం అమలులో తిరుపతిని రాష్ట్రంలో నెంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు కలిసికట్టుగా పని చేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. ముప్పై వేల పిఎం సూర్యఘర్ కనెక్షన్స్ తిరుపతిలో ఏర్పాటు చేయాలనేది లక్ష్యమని ఆయన చెప్పారు. శనివారం సాయంత్రం కచ్చపి ఆడిటోరియంలో పిఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎంతో దూరదృష్టితో పిఎం సూర్యఘర్ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనాయకులు నారా లోకేష్ లు పిఎం సూర్యఘర్‌ను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. థర్మల్ పవర్‌తో కాలుష్యం పెరిగిపోతుందని ఆయన తెలిపారు. కాలుష్య నియంత్రణకు సోలార్ పవర్ ను ప్రజలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు. దేశంలో కోటి ఇళ్ళకు పిఎం సూర్యఘర్ ఏర్పాటు లక్ష్యమని తిరుపతిలో ముప్పయ్ వేల రూఫ్ టాప్స్ ఏర్పాటు లక్ష్యమని ఆయన తెలిపారు. పిఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుంటే ముప్పయ్ ఏళ్ళు వినియోగించుకోవచ్చని ఆయన చెప్పారు. రెండు, మూడు కిలోవాట్స్ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుంటే కేంద్ర ప్రభుత్వం అరవై వేలు, డెబ్బైఎనిమిది వేల రూపాయలు సబ్సీడి ఇస్తుందని ఆయన చెప్పారు. ఆరు శాతం వడ్డీతో లోన్లు కూడా సర్వీస్ ప్రొవైడర్స్ ఏర్పాటు చేస్తారని ఆయన తెలిపారు. కావున ప్రజలు పిఎం సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకుని సోలార్ రూఫ్ టాప్ లు ఏర్పాటు చేసుకుని కాలుష్య నివారణలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ సహాయ కమిషనర్ అమరయ్య, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణా, బిజెపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, ఎస్పిడిసిఎల్ ఎస్ ఈ చంద్రశేఖర్, ఈఈలు బాలాజీ,గంగాధర్, రిటైర్డ్ ఎస్ ఈ మునిశంకర్, గంగమ్మ గుడి పాలకమండలి ఛైర్మన్ మహేష్ యాదవ్, జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి పాల్గొన్నారు.




మాట్లాడుతున్న తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

వంతెన పరిశీలన



ప్రజాశక్తి -చంద్రగిరి: చంద్రగిరి మండలం పరిధిలోని ఐతేపల్లి - రంగంపేట రోడ్డు మార్గంలోని పులితి వారిపల్లి బ్రిడ్జిని ఎమ్మెల్యే పులివర్తి నాని శనివారం పరిశీలించారు. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు స్వర్ణముఖి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. గత కొన్నేళ్లుగా అయితే పల్లి రంగంపేట రోడ్డులోని పులితివారిపల్లి బ్రిడ్జి మరమ్మతులు చేపట్టలేదని ఎమ్మెల్యేకి గ్రామస్తులు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సుమారు 14.60 కోట్ల రూపాయలతో నూతన బ్రిడ్జి ఏర్పాటుకు నిధులు మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఎమ్మెల్యే తెలిపారు. 2025లో నిర్వహించిన అసెంబ్లీ సమావేశాలలో చంద్రగిరి నియోజకవర్గంలోని శిథిలావస్థకు చేరుకున్న బ్రిడ్జిల స్థానంలో నూతన బ్రిడ్జిలో ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలోనే నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. రానున్న 24 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో పులితివారిపల్లి బ్రిడ్జి వద్ద జెసిబి ద్వారా అధికారులు పూడిక తీశారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పెద్దశేష వాహన సేవలో పాల్గొన్న మంత్రి నాదెండ్ల మనోహర్

పెద్ద శేష వాహనంపై మలయప్ప

ప్రజాశక్తి-తిరుమల: నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి పెద్ద శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 గంటల నుండి స్వామి, అమ్మవార్లు తిరుమాడ వీధుల్లో దర్శనమివ్వగా పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో చినజీయర్ స్వామి, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, వీజీవో సురేంద్ర, పేష్కార్ రామకృష్ణ పాల్గొన్నారు.



ఎన్‌ఎస్‌ఎస్ పెరేడ్ క్యాంప్‌కు పద్మావతీ మహిళా యూనివర్సిటీ విద్యార్థినులు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నుంచి ఎన్‌ఎస్‌ఎస్ ప్రిఆర్‌డి పెరేడ్ క్యాంప్‌కు ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ క్యాంప్ 31 అక్టోబర్ 2025 నుంచి 9 నవంబరు 2025 వరకు కొనసాగనుంది. హేమచంద్రచార్య నార్త్ గుజరాత్ యూనివర్సిటీ, పటాను , గుజరాత్‌లో నిర్వహించనున్నారు. శ్రీ పద్మావతీ మహిళా యూనివర్సిటీలోని ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 4 నుండి కే గంగోత్రి, యూనిట్ 5 నుండి డీ జయశ్రీ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.ఉమ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. రజినీ,ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఐ.వి. లలిత కుమారి వాలంటీర్సకు, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ మాధవి (యూనిట్ 5), డాక్టర్ గాయత్రి (యూనిట్ 4)లకు అభినందనలు తెలిపారు.

రేపు జాబ్ మేళా

ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: సీఐఐ కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ మోడల్ కెరీర్ సెంటర్, విజయవాడ, గ్లోబల్ ట్రెండ్స్ హెచ్‌ఆర్ ఆన్‌లైను సంస్థ, తిరుపతి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 27న (సోమవారం) జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గత 15 సంవత్సరాలుగా పలు జాబ్ మేళాలను నిర్వహించి వేలాది మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన గ్లోబల్ ట్రెండ్స్ హెచ్‌ఆర్ ఆన్‌లైను సంస్థ ఆహ్వానం మేరకు టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీ ఈ మేళాలో స్త్రీ అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు వారు తెలిపారు. 18 నుండి 25 సంవత్సరాల వయస్సు వున్న ఇంటర్, డిగ్రీ, డిప్లొమా లేదా బిటెక్ చదివిన మహిళలు ఈ ఉద్యోగాలకు అర్హులు అని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.17,500 వరకు జీతం, ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. పురుష అభ్యర్థులకు కూడా ఈ జాబ్ మేళాలో ఎంఆర్‌ఎఫ్, టీవీఎస్. లూకాస్ సంస్థలలో ఉద్యోగావకాశాలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే ప్రతి అభ్యర్థికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న శిక్షణా కార్యక్రమాలపై అవగాహన, గ్లోబల్ ట్రెండ్స్ హెచ్‌ఆర్ చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఎస్ కృష్ణమూర్తి అందిస్తామన్నారు.

నమోదు వివరాలు:

ఆసక్తికలిగిన అభ్యర్థులు ఎస్‌వి యూనివర్సిటీ ఫ్లైఓవర్ కింద, 187 ఎల్‌ఎస్ నగర్, శ్రీ శక్తి చాముండేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద ఉన్న గ్లోబల్ ట్రెండ్స్ హెచ్‌ఆర్ కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు. వివరాల కోసం: 94401 33535, 80744 24827 నెంబర్లను సంప్రదించవచ్చునని నిర్వాహకులు తెలిపారు.

నేడు విశ్వంలో ఉచిత సైనిక్ మోడల్ ఎంట్రన్స్ టెస్ట్

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి స్థానిక వరదరాజ నగర్ లోని విశ్వం సైనిక్ నవోదయ పోటీ పరీక్షల కేంద్రంలో ఈ నెల 26వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు ఉచిత సైనిక్ మోడల్ టెస్ట్, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్ విశ్వనాథ రెడ్డి తెలిపారు. 6,9వ తరగతి ప్రవేశానికి జాతీయ స్థాయిలో జనవరి 2026లో నిర్వహించే ప్రవేశ పరీక్షకు అనుగుణంగా ఈ నమూనా పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఈ నమూనా పరీక్ష , అవగాహన సదస్సు ద్వారా విద్యార్థులు ప్రధాన పరీక్షకు సంసిద్ధం కావడంతో పాటు సబ్జెక్ట్ పరంగా లోపాలను సరిదిద్దుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ నమూనా పరీక్షకు ఎలాంటి ప్రవేశ రుసుము చెల్లించాల్సిన వసరం లేదన్నారు. మరిన్ని వివరాల కోసం 8688888802 / 03, 9399976999 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చన్నారు.

వైసిపి కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయవద్దంటూ వైసిపి ఆధ్వర్యంలో మండలంలోని తాటిపర్తి పంచాయతీ కలిపూడిలో శనివారం కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైసిపి ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదేశానుసారం ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేద ప్రజలకు వైద్య విద్యను సులభతరం చేయడానికి వైద్య కళాశాలలు నిర్మాణం చేపడితే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు పేద ప్రజలకు వైద్య విద్యను దూరం చేసే విధంగా కార్పొరేట్ సంస్థలను బాగుపరిచే ఆలోచనతో పిపిపి విధానం తీసుకొచ్చి వైద్య కళాశాల నిర్మాణం, నిర్వహణ వారికి అప్ప చెప్పటం ఎంతో దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండలం వైసిపి మండల అధ్యక్షుడు కోగిల సుబ్రహ్మణ్యం, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.